క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



సీతారాములుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: మండలంలోని కొండపాలవలస గ్రామంలో రామాలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సీతారాములను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ప్రశాంత వాతావరణం నెలకుంటుందని, ప్రతిఒక్కరూ భగవంతుని నామస్మరణలో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, నాయుడువలస సర్పంచ్ ఎస్.లక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూ ఎస్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. గురువారం పట్టణంలో పన్ను వసూలుపై ఆటోతో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటకి మున్సిపాలిటీలో రూ.2.60 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.1.10 కోట్లు వసూలైందన్నారు. మిగిలిన రూ.1.50 కోట్లు వసూలు చేసి, శత శాతం లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి



సూచనలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించి, గృహప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన లబ్ధిదారులందరితోను నిర్మాణాలు చేయించి, శతశాతం నిర్మాణాల లక్ష్యం చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కనకరాజు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

రామభద్రపురం: విద్యార్థుల ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తిరుమలప్రసాద్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్రతీ ఐదు, పదిహేను సంవత్సరాలకు ఒకసారి ఆధార్‌లో ఫొటో అప్‌డేట్ చేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగానే పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

వంగర: సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండల పరిధిలోని సంగాం, మగ్గూరు గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, ఉద్యోగులు హాజరు, స్పందన వినతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం అరసాడలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

వంగర: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని వెలుగు శాఖ ఏపీ అలుగోలు చిరంజీవి కోరారు. గురువారం మండలంలోని కొప్పర గ్రామంలో ఏర్పాటు చేసిన మినపగుళ్ల తయారీ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. మహిళలకు అవసరమైన రుణాలు వెలుగు శాఖ నుంచి విరివిగా వస్తున్నాయని, ఎంచుకున్న రంగంలో మహిళలు రాణించి, ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సందర్శన

బొబ్బిలి: పట్టణంలోని రాణిమల్లమ్మదేవి పార్కును మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పిల్లల వినోదానికి ఏర్పాటు చేసిన పరికరాలు, జిమ్ పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

ఎంఈఓకు ఘనసన్మానం

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ జె.త్రినాథరావును సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంఈఓగా ఆయన కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్న నేపథ్యంలో ఆయనను సత్కరించారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయవలస గ్రామంలో ఎల్లమ్మతల్లి సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజుకో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందని, ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఆయనతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలతో జగనన్న ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసే ఇప్పుడు ఇంటింటికీ ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. అంతకుముందు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీటీసీ గొర్లె తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద' పరిశీలన



రాజాం: విద్యార్థుల కోసం వండిన భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని అధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని వెంకంపేట, తునివాడ గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు వంటలు రుచి, శుచి కలిగి ఉండాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం వంటకాలు చేయాలన్నారు. అనంతరం ఆధారిత మదింపు-2(కేప్-2) పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రాణి, ఎ.ఆనంద్ పాల్గొన్నారు.

రాజాం: జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని, ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. మండలంలోని రాజయ్యపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన తొలుత మెనూ చార్ట్ చూసి, మెనూలో పేర్కొన్న వంటకాలు చేశారా లేదా అనే విషయం పరిశీలించారు. అనంతరం వంటకాలు రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు భోజనాలు పెట్టాలని తెలిపారు. ప్రతిరోజూ రోజుకో విద్యార్థి తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు మధ్యాహ్న భోజనం చేసి, ఈ పథకం అమలు తీరును గమనించాలని కోరారు. అనంతరం పాఠశాలలోని మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయుడు రమేష్ వద్ద వివరాలు సేకరించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లె సీతారాంపురం ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదార్థాల రుచి, శుచిపై వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

స్వచ్ఛరాజాంకు సహకరించాలి

రాజాం: స్వచ్ఛరాజాం పట్టణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు కోరారు. గురువారం మండల పరిధిలోని డోలపేటలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తడి, పొడిచెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి క్లాప్ మిత్రులకు అందజేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం కాలువల్లో పేరుకుపోయిన మురుగు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు

రేగిడి: మండలంలోని లింగాలవలస, నాయరాలవలస గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అర్హులకే పథకాలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనులకు హాజరై, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257లు వేతనం వస్తుందన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

బాడంగి: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని పీడీఎంఎస్ మాస్టర్ ట్రైనీ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో నవధాన్యాల సాగు-నేలతల్లి బాగు అనే అంశంపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు కూడా వస్తాయన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం బాగా తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, వీఏఏ మురళీకృష్ణ, ఐసీఆర్‌పీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయండి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి, మండలంలోని అన్ని శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సాధనకు కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు అధ్యక్షతన జరిగిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ల సమావేశంలో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ అంత్యోదయలో భాగంగా 19 శాఖలకు సంబంధించి, 216 రకాల సూచనలను ప్రతీ శాఖ అధికారులతో సమన్వయపరచుకుంటూ సీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు సర్వే చేయాలన్నారు. ప్రతీ సచివాలయం ఎస్‌డీజీ లక్ష్యాలను సాధించేలా చూడాలన్నారు. మండలంలోని అన్ని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. అర్హులందరికీ పీఎంజేఏవైపై కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతీ సచివాలయంలో స్పందన గ్రీవెన్స్ సెల్ ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించాలని, ఉద్యోగులంతా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని, యూనిఫాం దుస్తులు ధరించాలన్నారు.

ఎలక్షన్ మోడల్ కోడ్ అమలు చేయండి

బాడంగి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలక్షన్ మోడల్ కోడ్ అమలు చేయాలని తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి బాలమురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన ఎలక్షన్ మోడల్ కోడ్, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాజకీయ నాయకుల కార్యక్రమాలకు హాజరు కావద్దని, ప్రభుత్వ కార్యాలయాలు, గోడలు, కరెంటు స్తంభాలపై ఉన్న వివిధ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, మసీదుల్లో సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అక్కారావు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు' రహిత సమాజం నిర్మిద్దాం

- డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమంలో వక్తలు



రేగిడి: ఏవీపురంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ



బొబ్బిలి: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన వాహనం చూపిస్తున్న సీఐ జైభీమ్



తెర్లాం జంక్షన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ రమేష్

బొబ్బిలి రూరల్: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ సూచించారు. మండలంలోని కోమటపల్లి భాస్కరా ఫార్మసీ కాలేజీలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా గురువారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన మత్తు పదార్థాలతో ఆరోగ్యం పాడవ్వడంతో పాటు జీవితం చిత్తు అవుతుందన్నారు. గంజాయి, ఖైనీ, గుట్కా, కొకైన్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాల వాడకం, తరలించడం, అమ్మకం వంటివి నేరమన్నారు. చాలామంది యువతీయువకులు వీటికి బానిసలై, జీవితాలు పాడు చేసుకుంటున్నారని, తద్వారా వారి కుటుంబాలు వీధినపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన వారికి అదనపు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్, ఎస్ఐ సీహెచ్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.రాజేష్ పాల్గొన్నారు.

తెర్లాం: మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు సూచించారు. పట్టణంలో ఎస్ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో 'యువతా మేలుకో-భవితను మలచుకో-డ్రగ్స్‌ను వదులుకో' అని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా అటువంటి వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో డ్రగ్స్‌ను విక్రయిస్తే ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నెంబర్ 14500కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలై అర్ధాంతరంగా మరణాన్ని కొనితెచ్చుకోవద్దన్నారు. డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

రేగిడి: మత్తు పదార్థాలు వాడితే జీవితాలు పాడైపోతాయని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని ఏవీ పురం ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ రహిత దిశగా ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా డ్రగ్స్ అమ్మినా, తీసుకున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

వంగర: యువత, విద్యార్థులంతా మత్తుకు బానిసలు కావొద్దని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు బానిసలైన విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది కూడా గమనించి, హెచ్చరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలి: డ్రగ్స్ వినియోగించొద్దని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను ప్రచార వాహనంతో ప్రజలకు వివరించాలని ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ సూచించారు. గురువారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో పరివర్తన వాహనం, వాహనం ద్వారా చేపట్టబోయే ప్రచారం వివరాలు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ అదనపు ఎస్పీకి వివరించారు.



వంగర: డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేశ్వరరావు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

- ఎమ్మెల్యే కంబాల జోగులు



లక్ష్మణరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, రాజాం సామాజిక ఆస్పత్రి అభివృద్ధికి అభివృద్ధి కమిటీతో కలిసి పలు తీర్మానాలు చేశామని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన రాజాం సామాజిక ఆస్పత్రిలో వైద్యసేవలు పెరిగాయని తెలిపారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులున్నారని, స్టాఫ్ రిక్రూట్‌మెంట్ కూడా పూర్తి చేశామన్నారు. గతంలో కన్నా ప్రస్తుతం ఆస్పత్రిలో అదనపు గదులు కేటాయించడంతో పాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ప్రతిరోజూ 300 నుంచి 400 వరకు ఓపీలు నమోదవుతున్నాయన్నారు. ప్రతీ నెల 80 నుంచి 90 మధ్య వివిధ రకాల ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయన్నారు. ఆస్పత్రి థియేటర్‌లో ఎక్సరే మిషన్లు, ఆస్పత్రికి కొత్త జనరేటర్, లిఫ్ట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని గతంలో వైద్యులు తమను కోరారని, ఈ మేరకు రూ.23 లక్షల అంచనా వ్యయంతో తీర్మానాలు చేసి, ప్రభుత్వానికి పంపించామని వివరించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజాం పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పొట్నూరు లక్ష్మణరావును ఎమ్మెల్యే జోగులు పరామర్శించారు. కార్యక్రమంలో రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు



డ్రోన్ సర్వే ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: సమగ్ర భూముల రీసర్వేతో రైతులు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని అలజంగి గ్రామంలో డ్రోన్ సర్వే ప్రారంభించిన ఆయన డ్రోన్ ద్వారా చేసిన సర్వే, మ్యాపింగ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఈ సర్వేతో ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. సర్వే జరిగేటప్పుడు రైతులు అందుబాటులో ఉండి, కొలతల్లో తేడాలు వస్తే అధికారులకు చెప్పుకోవాలన్నారు. అలాగే రైతు వద్ద ఉన్న ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేజేటి భద్రమ్మ, పార్టీ నాయకులు పి.చిన్న, ఆర్.బుజ్జి, ఎ.త్రినాథ, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు, సర్వేయరు దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే గెలుపు

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని కొండపాలవలస గ్రామంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారన్నారు. పార్టీని నమ్ముకున్న నేతలు, కార్యకర్తలకు పార్టీ పదవులు, ఆయనను నమ్మిన జనానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఆయన పాదయాత్రలో తెలుసుకున్న ప్రజల కష్టాలను తీర్చేందుకు గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని, వీటికి దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందని, జనమంతా సీఎం జగనన్న వెంటే ఉన్నారన్నారు. ఎన్ని విషప్రచారాలు, యాత్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయభేరి మోగిస్తుందన్నారు. గోరంత రాజకీయ పరిజ్ఞానం కూడా లేని లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయాలని, ఆయన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరాటపడుతున్నారని విమర్శించారు. ఆయన ఇప్పుడు చేస్తున్న పాదయాత్రలో ఏం మాట్లాడుతున్నారో ప్రజలు తలలు పట్టుకుంటున్నారన్నారు. కొన్నిచోట్ల టీడీపీ డబ్బులిచ్చి మరీ జనాన్ని రప్పించినా ఆయన స్పీచ్ విని పరుగులు తీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ కె.చంద్రశేఖర్, సర్పంచ్ ఎస్.లక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

రాజాం: మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెరపురుగు నివారణకు సేంద్రియ ఎరువులు వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఆనందరావు సూచించారు. గురువారం మండలంలోని గార్రాజు చీపురుపల్లిలో మొక్కజొన్న పంట సాగును పరిశీలించి, అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన కల్పించారు.

15 లీటర్ల ఆవుమూత్రం, కిలో పొగాకు, అరకిలో వెల్లుల్లి, కిలో పచ్చిమిర్చి, రెండు కిలోల వేపాకు ముద్ద, ఓ కిలో మునిగి చెక్కను తీసుకుని, వీటన్నింటినీ కలిపి ఆవుమూత్రంలో మూడు నుంచి నాలుగు పొంగులు వచ్చే వరకూ మరిగించాలని తెలిపారు. ఆ తర్వాత ద్రావణాన్ని 24 గంటల పాటు చల్లార్చి, 15 లీటర్ల నీటిలో అరలీటరు అగ్నిఅస్త్రం కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలని తెలిపారు. కత్తెరపురుగుతో పాటు కాండం, కాయతొలిచే పురుగులను సైతం దీనిద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ మెర్సీ, మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.